క్లుప్తంగా

రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

గోపాలపట్నం: గోపాలపట్నం నుంచి మర్రిపాలెం మధ్య రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే జనరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. సుమారు 50 నుంచి 55 ఏళ్ల మధ్య గల గుర్తు తెలియని వ్యక్తి(రైలు నుంచి జారిపడి గాని.. ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టి) మృతి చెందాడు. మృతుడి వద్ద ఎటువంటి సమాచారం లభించలేదు. స్థానికులు కూడా గుర్తించలేదు. మృత దేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. తెలుపురంగు షర్టు, క్రీమ్ కలర్ ఫ్యాంటు వేసుకున్నాడు. వ్యక్తి వివరాలు తెలిసిన 9666122722 , 9440627547 నంబర్లకు సమాచారమివ్వాలని కోరారు.

వైభవంగా సాగర దుర్గ తెప్పోత్సవం



అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

సింధియా: శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని సాగరి కనకదుర్గ ఆలయంలో బుధవారం అమ్మవారి తెప్పోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. పారిశ్రామికవేత్త మజ్జి సోమేష్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


వ్యక్తి ఆత్మహత్య



రాము మృతదేహం

మర్రిపాలెం: కంచరపాలెం ఫిఫ్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. జ్ఞానాపురం చాకలి గెడ్డ ప్రాంతంలో నివసిస్తున్న డి.రాము(55) గతంలో తాపీమేస్త్రిగా పనిచేసేవాడు. రెండేళ్ల నుంచి పనికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. అతడికి మద్యం తాగే అలవాటు ఉంది. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి భార్య డి.లక్ష్మి ఉదయం 10 గంటల ప్రాంతంలో బయటకు వెళ్లి తిరిగి సాయంత్రం 5 గంటలకు ఇంటికి వచ్చి చూసేసరికి గదిలో ఫ్యానుకు తాడుతో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. ఆమె ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ నరసింహం కేసు దర్యాప్తు చేపట్టారు.

జూలో ఆట పరికరాల ఏర్పాటు



జూలో కేంటీన్ పక్కన ఏర్పాటు చేసిన ఆట పరికరాలు వద్ద ఆటలాడుతున్న పిల్లలు..

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కుకు వెళ్లే పిల్లలు వన్యప్రాణుల సందర్శనతో పాటు ఎంచక్కా ఆటలాడుకోవచ్చు కూడా. ఇక్కడ వందల సంఖ్యలో వన్యప్రాణులున్నాయి. వాటిని తిలకించడంతో పాటు సరదాగా ఆడుకోవడం కోసం ఇటీవల జూ అధికారులు ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. జూలో నీటి ఏనుగుల కొలను ఎదురుగా క్యాంటీన్ పక్కన ఖాళీ స్థలంలో ఊయల, జారుడు బల్లలు, తేగుడు బల్ల తదితర ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. వాటి వద్ద పిల్లల సందడి ఎక్కువగా ఉంటోంది.

ప్రతీ సమస్యకు శాశ్వత పరిష్కారం

- 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి విశేష స్పందన
- మల్కాపురం మరిడిమాంబ కల్యాణ మండపంలో ఏర్పాటు
- సమస్యలను ఓపికగా విన్న అధికారులు



కార్యక్రమంలో పాల్గొన్న ఫిర్యాదుదారులు



ఓ మహిళ ఫిర్యాదును వింటున్న జేసీ కె.ఎస్.విశ్వనాథన్

మల్కాపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం సమస్యల పరిష్కార వేదికగా నిలుస్తోంది. పలు వార్డుల్లో ఉన్న దీర్ఘకాలిక ప్రజా సమస్యలకు ఈ కార్యక్రమం ద్వారా పరిష్కారం లభిస్తోంది. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మరిడిమాంబ కల్యాణ మండపంలో బుధవారం ఉదయం జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, తదితర ఉన్నతాధికారులు పాల్గొని అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. జీవీఎంసీ 40, 58, 59, 60, 61, 62, 63వ వార్డుల పరిధిలో సుమారు 60 మందికి పైగా అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఒకటికి రెండు సార్లు పరిశీలించి అధ్యయనం చేయాలని, శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రెండు, మూడు శాఖలకు చెందిన సమస్యలు ఉంటే సమన్వయం చేసుకోవాలని, అవసరమైతే సంయుక్త క్షేత్ర స్థాయి పరిశీలన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, జోన్–5 కమిషనర్ కృష్ణ, ములగాడ మండల రెవెన్యూ తహసీల్దార్ వీరభద్రరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 40వ వార్డు రాజీవ్ కాలనీలో పేదలకు పక్కా ఇళ్లు నిర్మాణం చేపట్టాలని కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానికులు వినతి పత్రాలు అందజేశారు. రేకుల షెడ్లలో ఉంటున్నామని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఏకేసీ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు.
- జీవీఎంసీ 58వ వార్డు గుల్లలపాలెం, రాంనగర్, ములగాడ ప్రధాన గెడ్డల ఆధునికీకరణ చేపట్టాలని కార్పొరేటర్ లావణ్య ఆధ్వర్యంలో ప్రజలు వినతి పత్రం అందజేశారు. గుల్లలపాలెం గెడ్డకు అడ్డంగా హెచ్‌పీసీఎల్ అధికారులు ఇనప జాలీ గేటు వేశారని, భారీ వర్షాలు పడే సమయంలో వ్యర్థాలు ఇనుప జాలీకి చిక్కుకుని నీరు పొంగి నివాసాల్లోకి ప్రవేశిస్తోందని వాపోయారు. దీనిపై స్పందించిన ఆర్డీవో.. సంఘటన స్థలానికి వెళ్లి గెడ్డ సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కింది స్థాయి అధికారులకు సూచించారు. జీవీఎంసీ 60వ వార్డు ఇందిరా కాలనీ కొండ ప్రాంతంలో తాగునీటి సమస్య ఉందని వైఎస్సార్‌సీపీ నాయకుడు జీవీఎల్ నరేష్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు అధికారులకు వినతులు ఇచ్చారు. అలాగే 24/7 ప్రాజెక్ట్‌లో భాగంగా ఇక్కడ నిర్మించిన భారీ రిజర్వాయర్‌ను త్వరగా ప్రారంభించాలని కోరారు.
- జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం పరిసర ప్రాంతాల్లోని పోర్టు భూమిని జీవీఎంసీ స్వాధీనం చేసుకుని, ప్రజావసరాలకు ఉపయోగపడేలా నిర్మాణాలు చేపట్టాలని కార్పొరేటర్ కొణతాల సుధ ఆధ్వర్యంలో మల్కాపురం గ్రామం కమిటీ ప్రతినిధులు అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. స్థానిక పరిశ్రమలు మల్కాపురాన్ని దత్తత తీసుకుని అవసరమైన మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
- జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురంలోని ప్రైమరీ పాఠశాలను అప్ గ్రేడ్ చేయాలని, కొండవాలు ప్రాంతాలలో రక్షణ గోడలు, సీసీ రోడ్డు, మెట్ల మార్గాలు నిర్మించాలని కార్పొరేటర్ బల్లా లక్ష్మణరావు ఆధ్వర్యంలో గ్రామం ప్రజలు అర్జీలు అందజేశారు.

సొంతింటి కల నెరవేర్చాలి



62వ వార్డు దుర్గానగర్‌లో ఉంటున్నాను. సొంతింటి కోసం అధికారులకు వినతి పత్రం అందించాను. దీనిపై అధికారులు స్పందించి తనకు తప్పక ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సొంతింటి కల నెరవేరుతుందని భావిస్తున్నా.

– వాకాడ నీలమ్మ, దుర్గానగర్

గ్రామ కంఠంలో అనధికారిక నిర్మాణాలు



61వ వార్డు మల్కాపురం గ్రామ కంఠానికి చెందిన స్థలంలో అనధికారిక నిర్మాణాలు జరుగుతున్నాయి. దీనిపై చర్యలు తీసుకోవాలి. ఆ స్థలంలో గ్రామ ప్రజల సౌకర్యార్థం నిర్మాణాలు చేపట్టాలని జేసీ, జీవీఎంసీ కమిషనర్‌కు వినతి ఇచ్చాను. దీనిపై వారు సానుకూలంగా స్పందించారు.

– చట్టి వినయ్‌యాదవ్, మల్కాపురం

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం



వైద్య సేవలను పరిశీలిస్తున్న నమ్మి శ్రీను



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది



లక్ష్మీనగర్ శిబిరంలో సేవలపై ఆరా తీస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసాగా నిలుస్తున్నారని జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అన్నారు. గోపాలపట్నం దరి లక్ష్మీనగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన పర్యవేక్షించారు. ఇక్కడి వైద్యులతో మాట్లాడి మెరుగైన సేవలు అందివ్వాలని సూచించారు. పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యురాలు పూజ పర్యవేక్షణలో 482 మందికి సేవలందించారు. డెంటల్, కంటి వైద్యులు, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్ వైద్య నిపుణులు వైద్య పరీక్షలు చేశారు. అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. క్షయ విభాగం సిబ్బంది ప్రత్యేక కౌంటర్ ద్వారా సేవలు అందించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు, శానిటరీ అధికారులతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు అప్పలస్వామి నాయుడు, టి. రమేష్, ఊటపల్లి గోవిందు, గంగరాజు, వెంకటరమణ, సుదర్శన్ తదితరులు సహాయ సహకారాలు అందించారు.

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు కాకానినగర్‌లో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కాకానినగర్‌తో పాటు పరిసర కాలనీలకు చెందిన వారు వైద్య సేవలు పొందారు. పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఆడారి ఆనంద్ కుమార్ సూచన మేరకు వార్డు నాయకుడు నమ్మి శ్రీను ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. శిబిరానికి వచ్చిన వృద్ధులకు వలంటీర్లు సేవలందించారు. వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యులు అవసరమైన చికిత్స చేసి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. వైద్య శిబిరానికి వచ్చిన వారికి ఆడారి ఆనంద్‌కుమార్ సహకారంతో రుచికరమైన భోజనం అందించారు.

నేడు బుచ్చిరాజుపాలెంలో

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని గురువారం 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలోని చైతన్య కాలేజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు నమ్మి శ్రీను తెలిపారు.పరిసర కాలనీ వాసులు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సర్వాంగ వజ్రకవచధారుడిగా వైభవుడు



వైభవ వేంకటేశ్వర స్వామి



అన్నమాచార్య కీర్తనలు ఆలపిస్తున్న వాత్సల్య బృందం

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధర్మ ప్రచారోత్సవాల్లో భాగంగా బుధవారం వైభవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని సర్వాంగ వజ్రకవచంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వొమ్మి వాత్సల్య బృందం ఆలపించిన అన్నమాచార్య కీర్తనలు భక్తులకు అలరించాయి. ఆలయ ఈవో బందారు ప్రసాద్ ఏర్పాట్లు పరిశీలించారు.

ఘనంగా ఏకాదశి ఆర్జిత సేవలు

సింహాచలం: ఏకాదశి పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జితసేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వర్ణతులసీదళార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. ఉభయదాతలను స్వర్ణ తులసీ దళాలతో ప్రదక్షిణ చేయించారు. స్వామి సన్నిధిలో విష్వక్సేనపూజ, పుణ్యావాచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళిపూజ నిర్వహి స్తూ 108 స్వర్ణతులసీ దళాలతో అర్చన చేశారు. ఆలయ ఏఈవో భ్రమరాంబ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విశేషంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాలు అందజేశారు.

భగవద్గీత సారంపై ప్రవచనం



ప్రవచిస్తున్న ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి, ఆచార్య దత్తాత్రేయ శాస్త్రి

సీతంపేట: కంచికామకోటి శంకరమఠం, గీతా ప్రచార సమితి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం శ్రీమద్ భగవద్గీత సారంపై శంకరమఠం ప్రాంగణంలో ప్రవచనం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి, ఆచార్య మద్దులపల్లి దత్తాత్రేయ శాస్త్రి భగవద్గీత సారంపై ప్రవచనం చేసి దాని విశిష్టతను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ గీతా సారాంశాన్ని తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో గీతా ప్రచార సమితి అధ్యక్షుడు చావలి విశ్వేశ్వరరావు, పలు ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళలకు పనిప్రదేశంలో కూర్చునే హక్కు కల్పించాలి

మర్రిపాలెం: శ్రామిక మహిళలకు పనిప్రదేశాల్లో కూర్చునే హక్కు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబీసీ విభాగం చైర్మన్ మూల వెంకటరావు బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. షాపింగ్ మాల్స్‌లో పనిచేసే మహిళలకు కూర్చునే హక్కు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చట్టం తేవాలని కోరారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ఇప్పటికే ఈ తరహా చట్టాలు ఉన్నాయని గుర్తుచేశారు. షాపింగ్ మాల్స్‌లో మహిళలు కూర్చోడానికి కుర్చీలు, స్టూళ్లు, బల్లలు ఏమీ ఉండవని పేర్కొన్నారు. వారు అధిక సమయం నిలబడి ఉండటం వల్ల మూత్రాశయ వ్యాధులు, కాళ్లపై వెరికోస్, వేయిన్స్, వెన్నుపూస, నడుం నొప్పి వంటి రుగ్మతలు వస్తున్నాయని విచారం వ్యక్తం చేశారు. పనిప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు కూడా అధికంగానే ఉన్నాయన్నారు. మహిళల కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తక్షణమే ఈ సమస్య పరిష్కారంలో భాగంగా చట్టం చేయాలని ఆయన కోరారు.

దేశ ఆర్థిక ప్రగతికి కార్మిక శక్తి కీలకం



రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న నాయకులు

కూర్మన్నపాలెం: దేశ ఆర్థిక ప్రగతికి కార్మిక శక్తి అత్యంత కీలకమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు తెలిపారు. అటువంటి కార్మిక శక్తిని విస్మరించి, కేంద్ర ప్రభుత్వం తన ఇష్టానుసారం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకుంటూ పోవడం సరికాదన్నారు. కార్మికులను విస్మరించిన ఏ ప్రభుత్వం చరిత్రలో బాగు పడలేదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 986వ రోజు బుధవారం స్టీల్‌ప్లాంట్ ఈఎస్ఎఫ్, ఈఆర్ఎస్, సేఫ్టీ, ఈఎండీ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు సంస్థను కాపాడుకునేందుకు ప్రజలు ఆందోళన చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్
- మహిళలకు దసరా కానుక అందజేత



చీరలు పంపిణీ చేస్తున్న శ్రీధర్, బీఎస్ కృష్ణ

విశాఖ విద్య: మహిళా సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ వార్డు పరిధిలో మహిళలకు ఇచ్చిన దసరా కానుకలను బుధవారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీఎస్ కృష్ణతో కలసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ అక్కాచెల్లెమ్మలు ఆనందంగా ఉండాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లక్ష్యమన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండేలా సంక్షేమ పథకాల్లో వారికి ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. సీఎం జగన్ స్ఫూర్తితో ఆడారి ఆనంద్ కుమార్ ముందుకెళ్తున్నారన్నారు. దసరా కానుకగా చీరలు అందించి ప్రతీ ఇంట పండగ వాతావరణం తీసుకొచ్చిన ఘనత ఆడారి ఆనంద్ కుమార్‌కు దక్కుతుందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీఎస్ కృష్ణ అన్నారు. పశ్చిమ నియోజకవర్గానికి మానవత్వం ఉన్న మంచి మనిషి ఆడారి ఆనంద్ కుమార్ లాంటి నాయకుడిని అందించిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. అలాంటి వ్యక్తి ఎమ్మెల్యే అయితే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జియ్యాని మారుతి, శ్రీను, సింహాచలం ట్రస్టు బోర్డు సభ్యురాలు శ్రీదేవి వర్మ తదితరులు పాల్గొన్నారు.

వెళ్లిరా.. దుర్గమ్మ

- కోలాహలంగా అమ్మవారి ఊరేగింపు
- ముగిసిన శరన్నవరాత్రి వేడుకలు



ఎన్ఏడీ కూడలిలో పూజలు నిర్వహిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

విశాఖ విద్య: దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి.దీంతో ఎన్ఏడీ కూడలిలో పలు చోట్ల ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ఊరేగింపుగా తీసుకెళ్లి భక్తుల జేజేలు నడుమ అనుపమహోత్సవం నిర్వహించారు. మహిళలు సైతం అధిక సంఖ్యలో పాల్గొని మళ్లీ రావమ్మా.. దుర్గమ్మా... అని పూజించారు.

- ఎన్ఏడీ ఆటో యూనియన్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎన్ఏడీ కూడలిలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జీఎస్ రెడ్డి, ఎంఏ రాజు, చిన్నా, వాసు, పీవీ కుమార్, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ రమణ

విశాఖ విద్య: ఎన్ఎస్‌టీఎల్ ఎదురుగా జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందాడు. మానవతాదృక్పథంతో 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. వివరాలు.. ఆదివారం తెల్లవారుజామున హైవేపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి చనిపోయాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు నమోదు చేసి మృతుడి వివరాలను తెలుసుకునే ప్రయత్నం చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ రమణ పోలీసులతో సంప్రదించి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు ముందుకొచ్చారు. పోలీసులు, మరికొంతమంది సహాయంతో మృతదేహాన్ని ఖననం చేశారు.

15న చలో విజయవాడ



చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

మద్దిలపాలెం: ప్రజా రక్షణకు నవంబర్ 15న చలో విజయవాడ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు అన్నారు. ఈ మేరకు పోస్టర్‌ను బుధవారం పిఠాపురం కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను టీడీపీ, జనసేన, వైఎస్సార్‌సీపీ, బీజేపీలు పక్కదారి పట్టిస్తున్నాయన్నారు. దీనిపై ప్రజా రక్షణ భేరిలో భాగంగా నవంబర్ 1న నుంచి రాష్ట్రంలో మూడు ప్రాంతాలలో బస్సు యాత్ర నిర్వహించనున్నామన్నారు. ఈ యాత్ర నవంబర్ 3న విశాఖపట్నం, పెందుర్తి జంక్షన్‌కు చేరుకుంటుందన్నారు. 4న ఎన్ఏడీ జంక్షన్, కంచరపాలెం, పూర్ణామార్కెట్, శ్రీహరిపురం, గాజువాక, కూర్మన్నపాలెంలో బస్సు యాత్రలు చేరుకుని, సభలు జరుగుతాయన్నారు. 15న విజయవాడలో ప్రజారక్షణ భేరి సభ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్కే ఎస్వీకుమార్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డిపోల్లో తనిఖీలు



దేవేంద్రనగర్ రేషన్ డిపోలో తనిఖీలు చేస్తున్న సివిల్ సప్లయ్ అధికారులు

కంచరపాలెం: కంచరపాలెం సర్కిల్–1 పరిధి దేవేంద్రనగర్, ధర్మానగర్, రెడ్డికంచరపాలెం రవీంద్రనగర్ ప్రాంతాల్లోని పలు రేషన్ డిపోల్లో బుధవారం సివిల్ సప్లయ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్–1 ఏఎస్‌వో మురళీధర్ మాట్లాడుతూ రేషన్ సరకుల పంపిణీలో పొరపాట్లు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిపోల్లో తనిఖీలు చేసి సరకులు, కార్డు హోల్డర్ల వివరాలపై ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు నిత్యావసర సరకులు సక్రమంగా అందేలా చూడాలని సూచించారు. అవకతవకలకు పాల్పడితే డిపో లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. తనిఖీల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రమణ, లలిత, అనూష తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కథా కచేరి



కథానిక చదువుతున్న అయ్యలసోమయాజుల ప్రసాద్

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన కథా కచేరి అలరించింది. కథకుల స్వీయ కథా పఠనం, వైవిధ్యంతో నిండిన కథలు అందరినీ ఆలోచింపజేశాయి. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ తెలుగు కథకు ఉత్తరాంధ్ర పుట్టినిల్లని, కథల్లో వివిధ రకాలను వివరించారు. డాక్టర్ కె.జి.వేణు విశిష్ట కథా పరిచయం శీర్షికలో రచయిత ఈతకోట సుబ్బారావు కథానిక ప్రాణం ఖరీదును చక్కగా విశ్లేషించారు. అనంతరం జరిగిన కథా కచేరీలో భాగవతుల సత్యనారాయణమూర్తి కథానిక మానవత్వం ఖరీదు, కె.వి.ఎస్.మూర్తి కథానిక అనసూయమ్మ గారి ఆరోప్రాణం, అయ్యలసోమయాజుల ప్రసాద్ దమయంతమ్మ దసరా పండగ కథానిక, కుప్పిలి భీమేశ్వరరావు దిక్సూచి కథానిక, కొత్తూరి రమణ పెళ్లిపుస్తకం కథానికలు వివిధ అంశాలను సృజించి అలరించాయి. కార్యక్రమంలో సాహితీ విమర్శకుడు డి.వి.సూర్యారావు, కె.రాంప్రసాద్, వేదుల కామేశ్వరశర్మ, శ్రీనివాసరావు, రాధారాణి పాల్గొన్నారు.